క్లుప్తంగా

ఉద్యోగులకు బదిలీలు సహజం

ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్



ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించిన ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

కడ్తాల్: విధి నిర్వాహణలో బదిలీలు సహజమని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కడ్తాలపోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న ఏఎస్‌ఐ సీతారాంరెడ్డిని ఆదివారం తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదేవిధంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాగార్జున కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



అసోసియేషన్ నూతన సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని నాగార్జున కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మీనేందర్ రావు, ఉపాధ్యక్షులు చెరుకు బాలశివుడు, సామ బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి రాజేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జనార్ధన్‌రెడ్డి, మధుసూధన్ రెడ్డి, సలహాదారులుగా మధుసూధన్ రావు, యాదయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శశిధర్ రెడ్డి, పృధ్వీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ప్రభాకర్ రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసరావు, వెంకట మల్లిఖార్జున్, సందీప్, జితేందర్‌ను ఎన్నుకున్నారు.

మండల కేంద్రంగా ప్రకటించండి

గట్టుఇప్పలపల్లి గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గట్టుఇప్పలపల్లి గ్రామస్తులు

తలకొండపల్లి: గట్టు ఇప్పలిపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు ఆదివారం భారీ ర్యాలీ తీశారు. మండల కేంద్రానికి కావాల్సిన అన్ని అర్హతలున్నా మా గ్రామాన్ని మండలంగా ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వివక్ష చూపిస్తున్న కారణంగానే మండలం ఏర్పాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలం ఏర్పాటు చేయాలని గతంలో 39 రోజులు సమ్మె, నిరహార దీక్షలు చేసినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైన ప్రభుత్వం స్పందించి మండల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేణురెడ్డి, యాదయ్య, చంద్రయ్య, సాయిరాం, మచ్చేందర్, పర్వత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి



ఎంపీ కోమటిరెడ్డితో సర్పంచ్ నహీదాబేగం

మంచాల: గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని జాపాల సర్పంచ్ నాహీదా బేగం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం కలిశారు. గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ కోమటిరెడ్డి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం తప్పక ఉంటుందన్నారు. ఎంపీ నిధుల నుంచి గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, నాయకులు ఆదిల్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన సయ్యద్ హబీబ్‌కు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో రూ.6000 సీఎంఆర్ ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రహ్మాన్, నాయకులు.. మల్లేశ్, దస్తగిరి, విజయ్, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

‘దశాబ్ది’తో నూతనోత్సాహం

- ఏకతాటిపైకి వచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- అన్నీ తానై చూసుకున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అధికారులు, స్థానిక నేతల సమన్వయంతో వేడుకలు
- పార్టీ ప్రచారానికి వాడుకున్నారంటూ విపక్షాల విమర్శలు



ఇటీవల అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలతో నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు (21 రోజుల పాటు) ప్రభుత్వం ఈ ఉత్సవాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. పార్టీ నేతలంతా ఒక్కతాటిపైకి వచ్చి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉత్సవాల నిర్వహణను అందరినీ సమన్వయం చేసుకుంటూ కీలక పాత్ర పోషించారంటూ నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది. అధికారులకు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ ప్రతి కార్యక్రమంలో ఆయనే స్వయంగా పాల్గొన్నారు. ఉత్సవాల మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు అన్నీ తానై చూసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాకు విద్యుత్ దీపాలతో అలంకరించడం, జాతీయ పతాకాలను ఎగురవేయడం, విద్యుత్ విజయోత్సవం, పారిశ్రామిక ఉత్సవం, సాగునీటి దినోత్సవం, సంక్షేమ సంబురాలు, సుపరిపాలన దినోత్సవం, సాహిత్య దినోత్సవం, తెలంగాణ రన్, మహిళా సంక్షేమ దినోత్సవం, అమరవీరుల దినోత్సవం తదితర కార్యక్రమాలను అధికారులతో సమన్వయం చేసుకుని బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేసుకున్నాయి. అంతేగాక బోనాలు, బతుకమ్మ ఊరేగింపులు చెరువుల వద్ద సందడి, మహిళా దినోత్సవం, భోజనాల కార్యక్రమాలతో ప్రజల్లోకి ఉత్సవాలను తీసుకెళ్లడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో కృషిచేశారు.

ఉత్తేజపరిచిన ఉత్సవాలు...

20 రోజులపాటు ప్రతి కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు.. అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు అర్థం అయ్యేరీతిలో కార్యకర్తలు సులువుగా వివరించేందుకు దోహదపడ్డాయి.

పార్టీ ప్రచారానికి వాడుకున్నారు..

దశాబ్ది ఉత్సవాలు అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నా ప్రతిపక్ష పార్టీలు ఈ వేడుకలకు దూరంగానే ఉన్నాయి. ప్రజల సొమ్ముతో ఉత్సవాలు నిర్వహించి పార్టీ ప్రచారానికి అధికార బీఆర్‌ఎస్ పార్టీ వాడుకుందని ప్రతిపక్ష పార్టీల ప్రధాన ఆరోపణ. కేసీఆర్, బీఆర్‌ఎస్ సర్కార్ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని.. వారు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి తప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత ఈసీ శేఖర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నేత సత్యనారాయణలు స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



మంచాల: కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

మంచాల: ముదిరాజ్‌లపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని ముదిరాజ్ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి డిమాండ్ చేశారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆ సంఘం నేతలు దహనం చేశారు. కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులను అవమానపర్చే విధంగా దూషించడం సరైంది కాదన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు కృష్ణ, సతీష్, జగన్, శంకర్, యాదయ్య, శంకరయ్య, అర్జున్, రాంచంద్రయ్య, మల్లేశ్, పాండు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పాలి..

తలకొండపల్లి: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఉప సర్పంచ్ అనిల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి, యువజన అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ మండల అధ్యక్షుడు యాదయ్య, శ్రీను, పాండు, శేఖర్, జంగయ్య, వెంకటేష్, నర్సింహ, శ్రీనివాసు, గణేష్, బాలకృష్ణ, శ్రీరామ్, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌కు తరలిన బీజేపీ నేతలు

కడ్తాల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహాజన సంపర్క్ అభియాన్ బహిరంగ సభకు మండల కేంద్రం నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్‌నాయక్, భగీరథ్, రవీందర్‌రెడ్డి, లక్ష్మన్‌నాయక్, డాక్టర్ రమేశ్, రెడ్యానాయక్, సాయిలాల్, మహేశ్, వెంకటేశ్‌గుప్త, మండల పార్టీ అధ్యక్షుడు మాన్యనాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణం నుంచి..

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభకు ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకుముందు ఆమనగల్లు పట్టణంలో వారు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో నాగర్‌కర్నూల్ తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్లు ఝాన్సీ శేఖర్, యాదమ్మ, శ్రీధర్, నాయకులు సాయి, జానయ్య, కిరణ్, శ్రీను, బైకని శ్రీశైలంయాదవ్, తోట గిరియాదవ్, పెద్దయ్య, మల్లేశ్, అశోక్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

ఆరుట్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్-పాషానరహరి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. వారందరికి గచ్చిబౌలిలో శంకర కంటి వైద్యశాలలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బాపయ్య చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, పాషానరహరి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు డీజీ నర్సింగ్ రావు, యాదయ్య, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, సహాయ కార్యదర్శులు రాజు, బుగ్గరాములు, గోపాల్, సభ్యులు కృష్ణ, యాదయ్య, జంగయ్య, హఫీజ్, లెనిన్, రంగాపూర్ సర్పంచ్ మమత అజయ్, చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చక్రపాణి

మంచాల: మంచాల మండలంలోని నోముల గ్రామానికి చెందిన చింతకింది చక్రపాణి టీటీడీపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా రెండవసారి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన పార్టీ బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే బీసీల అభివృద్ధి

పార్టీ యువజన విభాగం నేత మహేశ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్‌తోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకుడు కానుగుల మహేశ్ అన్నారు. ఆదివారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం అదనంగా 17 డిగ్రీ బీసీ గురుకులాలను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సంకల్పం వల్లనే బీసీ గురుకులాలు 19 నుంచి 327 వరకు పెరిగాయన్నారు. వెనుకబడిన వర్గాల జీవితాల్లో విద్య ద్వారా సమూల మార్పులు తీసుకొస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఆమనగల్లు సీఐ ఉపేందర్ బదిలీ



ఆమనగల్లు: ఆమనగల్లు సీఐగా పని చేస్తున్న జాల ఉపేందర్‌రావ్ బదిలీ అయ్యారు. సీఐ ఉపేందర్ రావ్‌ను అల్వాల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమనగల్లుకు ఇంకా ఎవరిని నియమించలేదు. దాదాపు 20 నెలల పాటు ఆమనగల్లు సీఐగా పనిచేసిన జాల ఉపేందర్ విశేష సేవలు అందించి ప్రజాభిమానం చూరగొన్నారు. ఆమనగల్లు సీఐగా ఉపేందర్ పలు అవార్డులను అందుకుని ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

‘మీ చదువుకు అండగా ఉంటా’



శిరీష, నాగమణితో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

తలకొండపల్లి: నిరుపేదలకు అండగా ఉండి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రముఖ సంఘ సంస్కర్త ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లికి చెందిన బైరపాక నాగార్జున, శిరేఖ దంపతులు.. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్ద కూతురు శిరీష నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మెస్సీ బయాలజీ, చిన్న కూతురు నాగమణి కల్వకుర్తి పట్టణంలో డిగ్రీ చదువుతున్నారు. నాగార్జున ఇటీవల మృతిచెందాడు. దీంతో తల్లికి పిల్లల పోషణ, చదువుల ఖర్చు భారమైంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి పిల్లలిద్దరికి అయ్యే చదువు ఖర్చులను తానే భరిస్తానని భరోసా పలికారు. ఆదివారం ఇంటికి వెళ్లి రూ.30,000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తుల్లో ఉన్నత విద్యకు సహాయం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలను విజయవంతం చేయండి

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్

కడ్తాల్: జూలై 2న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ.. జూలై 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆన్‌లైన్‌లో క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు.. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి మూడు బహుమతులు ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, స్మార్ట్ వాచ్, హియర్‌ప్యాడ్స్, హార్డ్‌డ్రైవ్, అలాగే నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటీ వాహనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇమ్రాన్‌బాబా, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తుర్కయంజాల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ విద్యార్థులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1994-95 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం తుర్కయంజాల్‌లోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. చదువుకునే రోజుల నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు.

గునుగల్‌లో..

యాచారం: మండల పరిధిలోని గునుగల్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి చదువుకున్న నాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తాము చదువుకునే రోజుల్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థికసహాయం చేయడానికి తీర్మానం చేసుకున్నారు.



యాచారం: గునుగల్ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ విద్యార్థులు

గిరిజన విద్యార్థికి ఘన సన్మానం



రాకేశ్‌ను సన్మానించిన జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: నీట్ పరీక్షల్లో 798వ ర్యాంకు సాధించిన మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన గిరిజన విద్యార్థి అంగోత్ రాకేశ్‌ను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాకేశ్‌కు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, గానుగుమార్లతండా వార్డు సభ్యులు శ్రీనునాయక్ రూ.5వేలు, గోవిందాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నేనావత్ గణేశ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియారమేశ్, సర్పంచ్ సులోచన సాయిలు, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు లక్పతినాయక్, నవీన్, పాండు, పాపానాయక్, శక్రునాయక్, లక్ష్మన్, శ్రీను, కిషన్, బాలునాయక్ ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన కమ్యూనిటీ హాల్‌లో సోనూ కరాటే అకాడమీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరాటే క్రీడాకారులకు గ్రేడింగ్ పరీక్షలతో పాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం బెల్ట్‌లను, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాణ ప్రతాప్‌కు బ్లాక్ బెల్ట్, మహేశ్, జగదీశ్, అభిలాష్, బ్లూబెల్ట్, మోక్షిత, అఖిలేశ్‌కు గ్రీన్‌బెల్ట్, సిద్ధూ, బబ్లూ, శివ, సాయికిరణ్‌కు ఎల్లోబెల్ట్, చిక్కికి పర్పుల్ బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సోనూ కరాటే అకాడమీ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు సోనియా బెల్ట్‌లు, ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, మార్కెట్ డైరెక్టర్ సేవ్యానాయక్, చీఫ్ ఎగ్జామినర్‌లు మాస్టర్ షిహాన్, రవీందర్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులతో అతిథులు

బస్టాండ్‌లో సమస్యల తిష్ట



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్

- ఆమనగల్లు బస్టాండ్‌లో వసతులు శూన్యం
- మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటివసతి కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఆమనగల్లు: నాలుగు మండలాలకు కూడలిగా ఉండి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆర్టీసీ బస్టాండ్‌లో సరైన సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులకు సరైన వసతులు కరువయ్యాయి. బస్టాండ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయం పైన ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో లేదని ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని అనుసరించి 20 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. ప్రతి నిత్యం వేలాదిమంది ప్రయాణికులతో వందలాది బస్సుల రాకపోకలతో బస్టాండ్ కిటకిటలాడుతుంది. రోజురోజుకు ప్రయాణికుల రద్దీ ఎక్కువ అవుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదు. బస్టాండ్‌ను విస్తరించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆదాయంపైనే దృష్టి...

ఆర్టీసీ అధికారులు ఆదాయం పైనే దృష్టిపెట్టడం తప్పిస్తే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. బస్టాండ్ స్థలం ఇరుకుగా ఉన్నప్పటికీ రెండు వైపులా షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇచ్చారు. అంతేకాకుండా బస్టాండ్ ఆవరణలో ఖాళీ ప్రదేశంలో చిన్నచిన్న షాపుల ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చారు. ఇటీవల మరో ఆరు షాపుల ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్లు తెలుస్తుంది. ఇరుకుగా ఉన్న స్థలంలో షాపుల ఏర్పాటుకు అధికారులు ఉత్సాహం చూపుతూ ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు కలిగిస్తున్నారు.

మంచినీటికి ఇబ్బందులు...

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మంచినీటి వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. బస్టాండ్ ఆవరణలో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో క్యాంటీన్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు మంచినీటికి, టిఫిన్‌కు బయటకు వెళ్లాల్సి వస్తోంది. బస్టాండ్ ఆవరణలో కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. ఇటీవల దాతలు బెంచీలు ఏర్పాటు చేయడంతో కాస్త సౌలభ్యం కుదిరింది. బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఇరుకుగా ఉన్నప్పటికీ షాపులను ఏర్పాటు చేసి అధికారులు అద్దెకు ఇవ్వడం ఎంతవరకు సబబు. ఆదాయంపైన ఉన్న దృష్టి ప్రయాణికుల వసతులను కల్పించడంలో ఎందుకు లేదు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన వసతులను వెంటనే కల్పించాలి.

– దశరథం, వెంకట్రావ్‌పేట, తలకొండపల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



ఆమనగల్లు బస్టాండ్ విస్తరణకు, అభివృద్ధికి కృషి చేస్తాం. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ద్వారా సంబంధిత ఆర్టీసీ అధికారులను కలిసి బస్టాండ్ విస్తరణ, సౌకర్యాల గురించి వివరిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. అవసరమైన వసతుల ఏర్పాటుకు కృషి చేస్తాం.

– అనురాధ, జెడ్పీటీసీ, ఆమనగల్లు